క్లుప్తంగా

దివ్యాంగ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ


విద్యార్థులకు మెటీరియల్ అందిస్తున్న అన్నపూర్ణ

రావికమతం: దివ్యాంగుల సేవ దైవ సేవతో సమానమని చోడవరం ఫోర్ జీఆర్ ట్రస్ట్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ తెలిపారు. మండలంలో పదో తరగతి చదువుతున్న 20 మంది దివ్యాంగ విద్యార్థులకు రూ.10 వేల విలువ చేసే స్టడీ మెటీరియల్, రగ్గులు, పరీక్ష అట్టలను ఆమె మంగళవారం వితరణగా అందించారు. ఈ సందర్భంగా మేడివాడ హైస్కూల్‌లో కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. హెచ్‌ఎం రామారావు, ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మినాయుడు, జగన్నాథనాయుడు పాల్గొన్నారు.

ఫైలేరియా నిర్ధారణ పరీక్షలు


ఎ.కోడూరులో రక్తపూతలను సేకరిస్తున్న వైద్య సిబ్బంది

కె.కోటపాడు: ప్రధానంగా మురుగునీటిలో ఉండే క్యూలెక్స్ దోమకాటు వల్ల ఫైలేరియా సోకుతుందని లంకవానిపాలెం పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు తెలిపారు. మంగళవారం ఎ.కోడూరులో ఫైలేరియా నిర్ధారణ కోసం రక్తపూతలను వైద్య సిబ్బంది సేకరించారు. 310 మంది నుంచి రక్తపూతలను సేకరించారు. ప్రజలు దోమకాటు బారిన పడితే బోద కాలుతోపాటు అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు ఎప్పటికప్పుడు నిల్వ నీటిని తొలగించుకోవాలని సూచించారు. సబ్ యూనిట్ అధికారి రమణ, హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్, ఏఎన్‌ఎం సంతోషి, ఎంఎల్‌హెచ్‌పీ శాంతి పాల్గొన్నారు.

సీపీఐ విరాళాల సేకరణ

మాకవరపాలెం: స్థానిక వారపు సంతలో దుకాణాలు, ఇతర చిల్లర వర్తకుల వద్ద సీపీఐ నాయకులు మంగళవారం విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు సన్యాసిరావు, సహాయ కార్యదర్శి దొరబాబు, మండల కార్యదర్శి పాలపర్తి తాతబ్బాయి, తదితరులు పాల్గొన్నారు.

జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు


ఎస్‌ఐ ఉపేంద్ర

గొలుగొండ: సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని కృష్ణదేవిపేట ఎస్‌ఐ ఉపేంద్ర హెచ్చరించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని కొంకసింగి, నాగాపురం ఏఎల్‌పురం, లింగంపేట, చోద్యం, గాదంపాలెం తదితర గ్రామాల్లో సంక్రాంతి సందర్భంగా కోడిపందాలు, పేకాటతోపాటు ఇతర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించొద్దని హెచ్చరికలు చేశారు.

కింతలిలో మేలుకొలుపు


స్వామివారి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: ధనుర్మాసం సందర్భంగా కింతలిలో సీతారాములు వారి మేలుకొలుపు నిర్వహిస్తున్నారు. నెలగంట ప్రారంభం నుంచి రోజూ తెల్లవారుజామున స్వామివారి చిత్రపటాన్ని ఊరేగింపు చేస్తున్నారు. సాయిరాము, వీరాంజనేయ, శ్రీరామ భక్తులతోపాటు దామరౌతు రాంబాబు, మైచర్ల ఈశ్వరావు, సకలా ఈశ్వరరావు, అప్పాన నారాయణరావు, ఉప సర్పంచ్ అద్దాడ గంగాధరరావు, సకలా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వాడవాడలా శ్రీరాముని అక్షింతల పంపిణీ

నాతవరం: అయోధ్యలో ఈ నెల 22న రాములోరి ఆలయం ప్రారంభం సందర్భంగా సమరసత ఫౌండేషన్ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నాతవరంలో ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేశారు. ప్రజలతో పాటు తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్‌ఐ, వివిధ శాఖల అధికారులకు పంపిణీ చేశారు. సమరసత ఫౌండేషన్ సభ్యులు, హరిభజన బృంద సభ్యులు, సిద్ధి వినాయక ఆలయ నిర్మాణ దాత యర్రా కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రదాత జగన్‌ను ఆశీర్వదించాలి


దేవరాపల్లిలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- దేవరాపల్లిలో 'గడపగడపకు' విశేష స్పందన

దేవరాపల్లి: వివక్షకు తావులేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత రాష్ట్ర చరిత్రలో సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం దేవరాపల్లిలో ఆయన ప్రతీ ఇంటికి వెళ్లి వృద్ధులను, దివ్యాంగులను, చిన్నారులను ఆత్మీయంగా పలకరించారు. ప్రభుత్వ సంక్షేమ లబ్ధిని వివరించి బుక్‌లెట్లు అందజేశారు. అర్హులందరికీ పథకాలు అందుతున్నాయా..లేదా అని అడిగి తెలుసుకుంటూ స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా తన దృష్టికి తీసుకువచ్చిన పలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇళ్లకు ఆనుకున్న విద్యుత్ తీగలు సరిచేయాలని, రెల్లి వీధిలో అంగన్‌వాడీ భవనం, కొన్ని చోట్ల సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని ప్రజలు కోరగా, తక్షణమే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దేవరాపల్లిని అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దిన డిప్యూటీ సీఎంను ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి సహా గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం అవ్వాతాతలకు రూ.3 వేల పింఛన్ సొమ్మును సీఎం జగన్ అందజేశారన్నారు. దేవరాపల్లి సచివాలయం-1 పరిధిలో ప్రత్యక్ష, పరోక్షంగా సంక్షేమ పథకాల రూపంలో 29 కోట్ల 35 లక్షల 47 వేల 516 రూపాయలను అందజేశామన్నారు. దేవరాపల్లిలో గతంలోనూ తమ హయాంలోనూ చేసిన అభివృద్ధిని బేరీజు వేసుకోవాలన్నారు. ప్రజా సంక్షేమ కోసం నిత్య పరితపించే సీఎం జగన్‌ను ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు. అనంతరం కొత్త పింఛన్లను, రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, రాష్ట్ర మహిళా సంయుక్త కార్యదర్శి రొంగలి నారాయణమ్మ, మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, ఈవోపీఆర్డీ జి. సంతోషి నళిని, పీఆర్ డీఈ టి. రమణ, యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, వైస్ ఎంపీపీలు చింతల బుల్లి లక్ష్మి, ఉగ్రూకుల గంగాభవానీ, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వి. సింహాచలంనాయుడు, కల్లుగీత కార్పొరేషన్ డైరెక్టర్ సిమ్మ అప్పన్న, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గొర్రుపోటు రమాదేవి, గాలి సూర్యలక్ష్మి, వేచలపు వాణి, సోమిరెడ్డి సత్యవతి, దీవింకర్, కొల్లి ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి


లబ్ధిదారులకు సూచనలు చేస్తున్న ఎంపీడీవో, జేఈ

నాతవరం: జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీవో హనుమంతరావు తెలిపారు. చమ్మచింత, నాతవరం గ్రామాల్లో జగనన్న లేఅవుట్లను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి నిర్మాణం పూర్తి చేసిన వారికి ఉచితంగా విద్యుత్ మీటరు, తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇంటి ప్రాంగణంలో ఇంకుడు గుంత తీసుకునేందుకు రూ.6 వేలు, మరుగుదొడ్డి నిర్మాణానికి అదనంగా రూ.12 వేలు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ జేఈ జోగారావు, సర్పంచ్ వెలకాడ కొండబాబు, ఉప సర్పంచ్ అప్పన దివాణం పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రంపై అవగాహన


ఈవీఎంపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌నాయుడు

నాతవరం: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాస్‌నాయుడు తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. ఈవీఎంలో ఓటు ఏ విధంగా వేయాలో కొత్తగా చేరిన ఓటర్లకు, వృద్ధులకు, నిరక్షరాస్యులకు అవగాహన కల్పించి వచ్చే ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించేందుకు చైతన్యం తీసుకొస్తున్నామన్నారు. ఎస్‌ఐ రామారావు, ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ కాపారపు అప్పలనర్స, సర్పంచ్ గొలగాని రాణి, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, తాండవ ప్రాజెక్టు మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ డైరెక్టరు ఇట్టంశెట్టి సీతారామమూర్తి, నాతవరం గ్రామ కమిటీ అధ్యక్షుడు శెట్టి లచ్చబాబు, వీఆర్వో బొత్స శ్రీను పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ ఖాసిమ్

కె.కోటపాడు: బాడీ బిల్డింగ్ పోటీల్లో అయ్యన్న డిగ్రీ కళాశాల విద్యార్థులు రెండు పతకాలను సాధించారు. విశాఖ నగరంలోని ఏయూలో మంగళవారం ఇంటర్ కాలేజియేట్ కమ్ యూనివర్సిటీ టీమ్ సెలక్షన్ ట్రైల్స్ 2023-24 పోటీల్లో పాల్గొన్న ఇమంది గణేష్ 60 కిలోల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడు. 65 కిలోల విభాగంలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రొంగలి రమేష్ కాంస్యం సాధించాడు. వీరిని అయ్యన్న విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్ అభినందించారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైస్ ఎంపీపీ రాజారామ్

మాడుగుల: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ అన్నారు. మంగళవారం సత్యవరంలో ఆ మహనీయుని విగ్రహానికి పూలమాలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 19న విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారన్నారు. దానికి మద్దతుగా సామాజిక న్యాయ మహా శిల్పం సంతకాల సేకరణ గ్రామాల్లో నిర్వహిస్తున్నామన్నారు. సర్పంచ్ జెర్రిపోతుల నాగమణి, ఎంపీటీసీ తలారి అప్పారావు, ఇన్‌చార్జి ఎంపీడీవో మీనాకుమారి, పంచాయతీ కార్యదర్శులు నాగేశ్వరరావు, విశాలక్ష్మి పాల్గొన్నారు.

కాశీపురంలో అభివృద్ధి పనులు ప్రారంభం నేడు

దేవరాపల్లి: కాశీపురంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, కాశీపురం నుంచి చింతలపూడి వరకు నిర్మించిన తారు రోడ్డును డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు బుధవారం ప్రారంభిస్తారని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు తెలిపారు. ఉదయం 8 గంటలకు ఈ రెండు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారన్నారు. దేవరాపల్లిలో ఉదయం 9 గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రెండు రోజు నిర్వహిస్తారన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

రూ.5 లక్షల చెక్కులు అందజేసిన నర్సీపట్నం ఎమ్మెల్యే గణేష్


బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలా మారింది. వైద్యం చేయించుకుని ఆర్థికంగా చితికిపోయిన వారి కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరుకు విశేషంగా కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం రెండు కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన అందజేశారు. మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి థెరిసా కాలనీకి చెందిన ఎస్.రేవతి ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడింది. ఆమెకు రూ.2 లక్షలు, గొలుగొండ మండలం పప్పుశెట్టిపాలెం పంచాయతీ జానకిరామపురానికి చెందిన సుర్ల రవి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మృతుడు భార్య సత్యవేణికి రూ.3 లక్షల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ, మాజీ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, వార్డు ఇన్‌చార్జి బేతిరెడ్డి విజయ్, సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, కోఆప్షన్ సభ్యురాలు షేక్ రోజా, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, వైఎస్సార్‌సీపీ గొలుగొండ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, యూత్ అధ్యక్షుడు మాకిరెడ్డి రామకృష్ణంనాయుడు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉండటమే సీఎం లక్ష్యం


రామన్నపాలెంలో లబ్ధిదారుకు పింఛను అందిస్తున్న వైస్ ఎంపీపీ రాజారావు

మాకవరపాలెం: పేదలకు అండగా ఉండటమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైస్ ఎంపీపీ తుల్లు రాజారావు, వైఎస్సార్‌సీపీ మండల అధికార ప్రతినిధి భీమిరెడ్డి గోవింద అన్నారు. మంగళవారం రామన్నపాలెంలో ఆయన లబ్ధిదారులకు వైఎస్సార్ పింఛను కానుకగా రూ.3 వేల నగదు పంపిణీ చేశారు. బూరుగుపాలెం సచివాలయం వద్ద లబ్ధిదారులతో కలసి జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నూతన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గుర్తించి, మరలా జగన్‌ను సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రామన్నపాలెం సర్పంచ్ మాకిరెడ్డి అయ్యప్ప, పార్టీ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్, డైరీని ఆవిష్కరించిన సీఐ శ్రీనివాసరావు, సంఘ నాయకులు

చోడవరం: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని చోడవరం సీఐ శ్రీనివాసరావు మంగళవారం ఆవిష్కరించారు. స్థానిక అంబేడ్కర్ భవనంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయ సంక్షేమానికి అంబేడ్కర్ ఆశయ సాధనకు సంఘాలు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో జయలక్ష్మి, రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చందోలు వెంకటేశ్వరరావు, రిటైర్డ్ లెక్చరర్ నడుపూరి దేముడు మాస్టారు, సర్పంచ్ బండి నూకాలమ్మశ్రీను, అంబేడ్కర్ భవనం కార్యదర్శి వరప్రసాద్, ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు ఎంఎస్ భాస్కరరావు, మత్స్యలింగం, చోడవరం, బుచ్చెయ్యపేట, చీడికాడ, కె.కోటపాడు మండలాలకు చెందిన సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల సంబరాలు


కె.కోటపాడు: వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు


బుచ్చెయ్యపేట: వైఎస్సార్ విగ్రహం వద్ద సంబరాల్లో పాల్గొన్న నాయకులు

కె.కోటపాడు/బుచ్చెయ్యపేట: ప్రజా సంకల్ప పాదయాత్ర ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. కె.కోటపాడు మండలం ఎ.కోడూరు కూడలి వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండలాధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు నివాళులర్పించారు. బుచ్చెయ్యపేట మండలం పొట్టిదొరపాలెంలో మహానేత వైఎస్సార్ విగ్రహానికి చోడవరం నియోజకవర్గ యువజన సంఘం నాయకుడు కరణం సూర్య పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి మాటమీద నిలబడ్డ సీఎంగా చరిత్రలో జగనన్న పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా విద్యార్థి సంఘం జాయింట్ సెక్రటరీ మజ్జి సోమేష్, సర్పంచ్ దరిమిశెట్టి యశోద అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ రాజు, యూత్ లీడర్ వడ్డి నాగేశ్వరరావు నాయకులు కొసిరెడ్డి బాజ్జి, దరిమిశెట్టి మహాదేముడు, జోగుబాబు, నాయకులు లెక్కల శంకరరావు, బొడ్డు శ్రీను, దొగ్గ సత్యం, పాటూరి ఈశ్వరరావు, పాపునాయుడు పాల్గొన్నారు.

ప్రజలందరి ఆరోగ్యమే జగనన్న ధ్యేయం


శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీపీ రాజేశ్వరి


రావికమతం: రోగి నుంచి ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న గైనకాలజిస్ట్ స్మృతి


కాశీపురంలో చిన్నారిని పరీక్షిస్తున్న డాక్టరు పూజ్యమేఘన

విజయరామరాజుపేటలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో విప్ ధర్మశ్రీ


మాడుగుల: సత్యవరంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభిస్తున్న ఎంపీపీ రామధర్మజ


పేటలో ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్న విప్ కరణం ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట/చోడవరం: రాష్ట్రంలో ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్న దృఢ సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాటు పడుతున్నారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. మంగళవారం బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేటలోనూ చోడవరం మండలం వెంకన్నపాలెంలోనూ జగనన్న ఆరోగ్య సురక్ష -2 శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి దఫా కార్యక్రమంలో మోకాళ్ల, ఒంటి, కీళ్ల నొప్పులకు సంబంధించిన కేసులు ఎక్కువగా నమోదు కావడంతో ఈ సారి ఆర్థోపెడిక్ డాక్టర్‌ను తీసుకొచ్చి వైద్య సేవలందిస్తున్నామన్నారు. మొదటి సురక్ష శిబిరంలో 500 నుంచి 800 మంది వరకు వైద్య సేవలు పొందారన్నారు. ఇప్పుడు 200 నుంచి 300 మంది లోపు మాత్రమే వస్తున్నారని, దీనివల్ల ప్రజల ఆరోగ్యాలు బాగుపడుతున్నాయన్నారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.2 లక్షలతో ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభించగా, నేడు ఆయన కుమారుడు ప్రస్తుత సీఎం జగనన్న రూ. 25 లక్షలకు పెంచారన్నారు. దీన్నిబట్టి ప్రజారోగ్యంపై ఎంత శ్రద్ధ తీసుకుంటున్నారో గ్రహించాలన్నారు. పేటలో వైద్యులు కె. ఉత్తమ్‌నందన్, శకుంతల, వినయ్ తమ సిబ్బందితో 211 మందిని పరీక్షించి మందులు అందించారు. వెంకన్నపాలెంలో వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ఆధ్వర్యంలో వైద్యుల బృందం 248 మందికి వైద్య సేవలందించింది. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ గాడి కాసు, ఎంపీడీవో శ్యామ్ సుందర్, సర్పంచ్‌లు మొల్లి ఈశ్వరరావు, ఎల్లపు విజయ్‌కుమార్, బీసీ సెల్ మండలాధ్యక్షుడు మొల్లి సోమునాయుడు, కోఆపరేటివ్ అధ్యక్షుడు ఎల్లపు గోవింద, పంచాయతీ కార్యదర్శి శ్రీనువాసరావు, ఉప సర్పంచ్‌లు ఉరుకుటి సింహాచలంనాయుడు, జగ్గు, వైఎస్సార్‌సీపీ నాయకులు నంబారు శ్రీనువాసరావు, పాము అప్పలనాయుడు, మాజీ ఎంపీటీసీ పిల్లల గోవింద పాల్గొన్నారు.

మాడుగుల: గ్రామీణ నిరుపేదలకు అండగా జగనన్న ఆరోగ్య సురక్ష నిలుస్తోందని ఎంపీపీ వేమవరపు రామధర్మజ అన్నారు. మంగళవారం సత్యవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పేదలపాలిట వరంగా మారిందన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాలెంనాయుడు, సంతోష్ కుమార్ బీపీ, సుగర్, తదితర పరీక్షలు 205 మందికి చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తలారి అప్పారావు, సత్యవరం, జంపెన సర్పంచ్‌లు జెర్రిపోతుల నాగమణిరామారావు నేమాల గురువునాయుడు, నాయకులు కాళ్ల రాజు, శనివాడ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి విశాలక్ష్మి పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ ఆరోగ్యం

నర్సీపట్నం: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యమని ఎంపీపీ సుర్ల రాజేశ్వరి తెలిపారు. అమలాపురంలో జగనన్న ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నలుగురు డాక్టర్ల బృందం, సిబ్బందితో ఏర్పాటు చేసిన వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అంబేడ్కర్‌కు నివాళులర్పించిన ఎంపీపీ..

డా.బి.ఆర్.అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవంలో భాగంగా అమలాపురంలో మహనీయుని విగ్రహానికి ఎంపీపీ రాజేశ్వరి, పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ అచ్చిరాజు, ఎంపీడీవో కార్యాలయ ఏవో రమణబాబు, ఎస్.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రావికమతం: కొమిరలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమం విజయవంతమైంది. ఈ శిబిరంలో 312 మంది పాల్గొన్నారు. చోడవరం నుంచి ప్రత్యేక వైద్య నిపుణులు అశోక్‌కుమార్, స్మృతి, రావికమతం వైద్యాధికారి దుర్గాప్రసాద్ రోగులకు పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందించారు. గ్రామాలకే వైద్య నిపుణులను పంపించి ప్రత్యేక వైద్యం అందిస్తున్న జగనన్ననే మళ్లీ సీఎంగా చేసుకోవాలని సర్పంచ్ గొర్లె రవికుమార్ కోరారు.

దేవరాపల్లి: కాశీపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. స్పెషలిస్టు వైద్యుడు డి.అరుణకుమార్, గైనకాలజిస్టు బి. రోజారాణి, వైద్యాధికారి ఇ. పూజ్య మేఘన వైద్య సేవలందించారు. 312 మందిని పరీక్షించి ఒకరిని మెరుగైన వైద్య సేవలకోసం రిఫరల్ చేశారు.

నేటి నుంచి మండల స్థాయి పోటీలు

మాడుగుల రూరల్/ రోలుగుంట: ఆడుదాం- ఆంధ్రాలో భాగంగా బుధవారం నుంచి మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు మాడుగుల ఇన్‌చార్జి ఎంపీడీవో మీనాకుమారి, రోలుగుంట ఎంఈవో జాను ప్రసాద్, ఈవోపీఆర్డీ ఎ.నూకరాజు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో పోటీలు నిర్వహిస్తామన్నారు.